క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం కార్యదర్శిగా మద్దు



పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మద్దు నరేష్‌ను నియమించారు. నియామకపత్రాన్ని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మద్దు నరేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ పదవులు పొందిన వారు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. అనంతరం మద్దు నరేష్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ వెంకటేశ్వర నాయక్ మృతి బాధాకరం



వెల్దుర్తి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తూ వారికి కేటాయించిన 50 గృహాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ కళావత్ వెంకటేశ్వర నాయక్ (26) మృతి బాధాకరమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శ్రీరాంపురంతండాలో వలంటీర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పీఆర్కే శ్రీరాంపురంతండాకు వెళ్లి వలంటీర్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవళ్ళ ఏగయ్య, మాజీ సర్పంచ్ హనుమానాయక్, లక్ష్మానాయక్, కార్యకర్తలు తదితరులున్నారు.

ఈవీఎంలపై బీఎల్‌వోలకు అవగాహన

గురజాల : ఈవీఎంలపై ప్రతి ఒక్క బీఎల్‌వో అవగాహన కలిగి వుండాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు ఈవీఎంలను ఏ విధంగా ఉపయోగించాలి ఏమైనా సమస్యలు వస్తే ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాల గురించి సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు తదితరులున్నారు.

వాటర్ ట్యాంకర్ ఏర్పాటు

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ఏర్పడిన మంచి నీటి సమస్యను పరిష్కరించడానికి వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ తెలిపారు. సర్పంచ్ దావులూరి నాగమ్మ గ్రామంలో పలు కాలనీల్లో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకువచ్చిన నేపథ్యంలో గురువారం ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, గ్రామ పెద్దలతో కలిసి వాటర్ ట్యాంకర్‌కు పూజలు నిర్వహించి మాట్లాడారు. తాగునీరు వృధా చేయవద్దని వాటర్ ట్యాంకర్ వచ్చిన సమయంలో ఘర్షణ పడకుండా సమ న్వయంగా నీరు పట్టుకోవాలని సూచించారు.

పోలీసు వారికి సహకరించాలి

ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి



సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంకు తరలివచ్చే భక్తులు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన సత్రశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గురజాల, రెంటచింతల నుంచి వచ్చే వాహనాలకు మిట్టగుడిపాడు రోడ్డు మార్గాన అనుమతి లేదని వారు పాలువాయి జంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం నుంచి సత్రశాల దేవస్థానానికి వెళ్లాలన్నారు. మూలమలుపుల వద్ద వేగంగా వాహనం నడిపి ప్రమాదం కొని తెచ్చుకోవద్దన్నారు. అన్నదాన సత్రాలకు సరుకులు ఇతర వస్తువులు తెచ్చుకునేందుకు పాస్‌లు ఉన్నవారు వారి వాహనాలను వారి సత్రాలలో మాత్రమే నిలుపుకోవాలన్నారు. దేవస్థానం వద్ద వాహనాలను నిలపరాదన్నారు. పాస్‌లు లేని భక్తులు పోలీసు వారు చూపిన పార్కింగ్ స్థలంలో మాత్రమే వాహనాలు నిలుపుకోవాలన్నారు. ఆటోలు పాలువాయి జంక్షన్ వరకు అనుమతించబడతాయన్నారు. ప్రశాంతంగా భక్తులు దైవ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించి సంతృప్తితో వారి ప్రాంతాలకు తిరిగివెళ్లేలా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విధులు నిర్వహించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ప్రభుత్వ భరోసాతో రబీ వరి సిరులు

- కళకళలాడుతున్న రబీ వరి
- నిరంతరాయంగా 9 గంటల విద్యుత్
- రైతులలో కొత్త ఉత్సాహం నింపిన వరి పంట



మిట్టగుడిపాడు గ్రామ శివార్లో ఏజీఎల్ కనెక్షన్ ద్వారా వరి పంటకు పెడుతున్న నీరు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో రబీ సీజన్‌లో సాగుచేస్తున్న వరి పంట కళకళలాడుతుండటంతో రైతులలో కొత్త ఉత్సాహం నింపింది. మండలంలో ఈ రబీ సీజన్‌లో మొత్తం 3,386 ఎకరాలలో రైతులు వరిపంటను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా 5,274 ఎకరాలలో రైతులు వరి పంటను వేయగా ఒక్కొక్క రైతుకు సగటున ఎకరాకు 45 బస్తాల నుంచి 53 బస్తాల వరకు అధిక దిగుబడులు రావడమే కాకుండా ధర కూడా రూ.1,750 నుంచి రూ.2 వేల వరకు ఆశాజనకంగా ఉండటంతో రైతులు రబీ వరి సాగుకు మొగ్గు చూపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏజీఎల్ కనెక్షన్ల (వ్యవసాయ పంపుసెట్లు)కు నిరంతరాయంగా 9 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో అన్నదాతలకు ఎంతో ఊరట లభించింది. 11 గ్రామాలలో మొత్తం 3,584 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా విద్యుత్ మోటార్ల కింద పుష్కలంగా నీరు అందుబాటులో ఉండటంతో ఎక్కువగా వరి పంట సాగు చేస్తున్నారు.



మంచికల్లు గ్రామ శివార్లో కళకళలాడుతున్న రబీ వరి పంట

పల్నాడు కోనసీమగా పేరు పొందిన మంచికల్లు గ్రామంలో అత్యధికంగా 1,390 ఎకరాలలో, రెంటాలలో 723 ఎకరాలు, రెంటచింతలలో 568 ఎకరాలు, పాలువాయిగేటు గ్రామంలో 483 ఎకరాలలో రబీ వరి పంట వేశారు. ఈ గ్రామ రైతులకు సమీపంలో బుగ్గవాగు డ్యామ్ ఉండటంతో వారికి సాగు నీటికి ఇబ్బంది లేదు.

9 గంటల ఉచిత విద్యుత్ రైతులకు ఊపిరి పోసింది..



వ్యవసాయానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన మాటకు కట్టుబడి 9 గంటల విద్యుత్ ఇచ్చి ఎంతో మేలు చేయడంతో రైతులకు ఊపిరి పోసింది. నేను ఖరీఫ్‌లో 10 ఎకరాలలో వరి పంట సాగు చేయగా ఎకరాకు 48 బస్తాల దిగుబడి వచ్చింది. ధర కూడా రూ.1,850 పలకడంతో గిట్టుబాటు అయింది. దీంతో రబీలో కూడా 10 ఎకరాలలో వరి వేయగా కళకళలాడుతూ మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం, ఎరువులు రాయితీపై అందజేయడం మేలు జరిగింది. – గొలమారి శ్రీనివాసరెడ్డి, రైతు, పాలువాయిగేటు

రైతులకు సిరులు కురిపిస్తున్న వరి పంట..



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నా సొంత 3 ఎకరాల భూమితో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగుచేశా. 43 బస్తాల దిగుబడి రాగా రూ.1,900 ధర పలికింది. వరి సాగు చేసిన రైతులకు సిరులు కురిపించింది. అధిక దిగుబడులతో పాటు మంచి గిట్టుబాటు ధరలు పలకడంతో రైతులకు కొత్త ఉత్సాహం వచ్చింది. విద్యుత్ నిరంతరాయంగా ఇవ్వడం వలన మాకు పుష్కలంగా సాగునీరు ఉండటంతో రబీ వరి పంట సాగుచేశా. మా గ్రామ ధాన్యం మేలురకం కావడంతో ధర కొంత ఎక్కువ పలుకుతుంది. -వెన్నా వెంకటరెడ్డి, కౌలు రైతు, మంచికల్లు గ్రామం

యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక వల్లెల గార్డెన్‌లో గురువారం రాత్రి పాస్టర్లు, సిస్టర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. పాస్టర్లు, సిస్టర్లకు ప్రతి నెలా గౌరవ వేతనం అందిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం గొప్పదన్నారు. అవకాశం వచ్చినప్పుడు ప్రజలు రుణం తీర్చుకోవాలనే ఆలోచనతోనే ముందుకు వెళ్తున్నామన్నారు. పాస్టర్ల సమస్యలు త్వరలో పరిష్కరిస్తామన్నారు. పేద పాస్టర్లకు తప్పనిసరిగా ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అలవి కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు మోసపూరిత వాగ్దానాలను ఎవరూ నమ్మవద్దన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. అనంతరం పాస్టర్లకు, సిస్టర్లకు దుస్తులు పంపిణీ చేసి వారిని ఘనంగా సత్కరించారు. జిల్లా, నియోజకవర్గ, మండలాల పాస్టర్లు, సిస్టర్స్ పాల్గొన్నారు. సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కాలే మాణిక్యరావు, సీహెచ్ సంతోషరావు, చల్లా పిచ్చిరెడ్డి, కుక్కమూడి సుందరరావు, మంద సుధీర్, పసుపులేటి ఆనంద్, వర్ల రత్నం, జడ సురేంద్ర, బంకా మణిక్యాలరావు, గొట్టేముక్కల పవన రెడ్డి, స్వామి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మాచర్ల: మహాశివరాత్రి, సాగర్ మాత తిరునాళ్ల పురస్కరించుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ప్రారంభమయ్యాయి. రెండు వైపులా గురువారం మధ్యాహ్నం నుంచి బస్సులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శ్రీశైలంకు దాదాపు 15 బస్సులు పంపగా, సాగర్ మాత తిరునాళ్లకు 25 బస్సులు పంపారు. శుక్రవారం తేరాల, మన్నేపల్లి, సత్రశాలతో పాటు అనేక శివాలయాలకు ప్రత్యేక బస్సులు సాధారణ చార్జీలతో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణంతో రైతాంగానికి మేలు



గ్రామ సచివాలయం శిలాఫలకం ఆవిష్కరణలో ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతు సోదరుల కోసం విద్యుత్ సమస్య లేకుండా నూతన సబ్ స్టేషన్‌లు నిర్మించి నిరంతర విద్యుత్ కోసం కృషి చేస్తున్నట్లు పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామంలో రూ.4.5 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామీణ ప్రజానీకానికి మేలు చేసే విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందే విధంగా మన ప్రభుత్వం హయాంలో జరిగిందన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో లో ఓల్టేజితో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి పూర్తి స్థాయిలో 9 గంటల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జెడ్పీటీసీ షేక్ షఫి, సర్పంచ్ జవ్వాజి నాగేంద్రం, మండల పార్టీ కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెన్నపూసల బుల్లబ్బాయి, మామిడి శేఖర్, బొమ్మిన అల్లయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, మాచర్ల ఏడుకొండలు, మామిడి అన్నారావు, జవ్వాజి బాలరాజు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



ఇంటి పట్టాలు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నారని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని 23వ వార్డులో గాంధీనగర్ నీళ్ల ట్యాంక్ సమీపంలో గురువారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సర్వే నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులైన మహిళలకు ఇంటి పట్టాలు అందిచారు. మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పుష్పలత, సురేంద్ర, బంగారు రెడ్డి, వార్డు కన్వీనర్ నాగిరెడ్డి, సచివాలయ అడ్మిన్లు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న మురళీధర్‌రెడ్డి

గురజాల : పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో జగనన్న లే అవుట్‌లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి చేసి పత్రాలను గురువారం సాయంత్రం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే విడతలో ఇంతమందికి ఇంటి స్థలాలు అందించడం ఇదే ప్రథమమని గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా అందించలేదన్నారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మాజీ జెడ్పీటీసీ బి.ఇష్టకామిరెడ్డి, కౌన్సిలర్ యెనుముల దివ్యవాణి, వీరారెడ్డి ఉన్నారు.

2,256 మంది మహిళలకు వైఎస్సార్ చేయూత



ఎంపీపీ సంపూర్ణమ్మను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది, చేయూత లబ్ధిదారులు

రెంటచింతల: నవరత్నాలలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాలలో 45 సంవత్సరాలు పైబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 2,256 మంది మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం నగదు వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని ఎంపీడీవో శంకర్‌రావు, ఎంపీపీ సంపూర్ణమ్మ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వారు వైఎస్సార్ చేయూత పొందిన లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో సారి వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించి మాట్లాడారు. ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున మొత్తం రూ.4.23 కోట్ల ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. కష్టకాలంలో పేద మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ, ఆసరా, అమ్మఒడి, చేయూత వంటి పథకాలను అందజేసి వారి జీవితాలలో వెలుగులు నింపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మను సన్మానించారు. ఎంపీడీవో శంకర్‌రావు మాట్లాడుతూ స్త్రీ మూర్తి అంటేనే కంటికి కనిపించే దైవంగా కొనియాడ బడుతుందని, మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని సమాజ అభివృద్ధిలో వారు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వెలుగు సీసీ శ్రీనివాసరావు, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శివ పూజకు సర్వం సిద్ధం

- కొలిచిన వారికి కొంగు బంగారం
- ప్రకృతి సోయగాల మధ్య కొలువైన స్వామివారు



సత్రశాల దేవస్థానంలో ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు



ఏలేశ్వరం స్వామి గట్టుపై ఉన్న దేవాలయం

గురజాల: పల్నాడు ప్రాంతంలోని భక్తులకు భోగభాగ్యాలిచ్చే... అమరలింగేశ్వరుడు మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా.. చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన అమరలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం ఒక అనుభూతి అని భక్తుల నమ్మకం. మండల పరిధిలోని దైద గ్రామ సమీపంలో కృష్ణానది తీరంలో ప్రకృతి సిద్ధమైన బిలంలో కొలువై ఉన్న అమరలింగేశ్వరుడు మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాడు. ప్రతి సంవత్సరం ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

దేవాలయ విశిష్టత..

కృష్ణానది తీరంలో బిలంలో వెలిసిన అమరలింగేశ్వర స్వామి మహిమలు కోకల్లలు. పులిపాడు గ్రామానికి చెందిన కొండ్రు రామయ్య వందల సంవత్సరాల క్రితం పశువులను మేపుకునేందుకు నదీతీరానికి వెళ్లాడు. కొండపై పశువులు మేత మేస్తుండగా అక్కడే ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో అతనికి భజనలు చేస్తున్న శబ్దం వినిపించింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి నిద్రలేచి, వెంటనే గ్రామస్తులకు వివరించగా, వెంటనే అందరూ అక్కడకు వచ్చి వెతుకుగా వారికి ఒక బిలం కనపడింది. బిలంలోకి వెళ్లి చూడగా అక్కడ వారికి దివ్యమైన లింగాకారం కనిపించింది. ఆ క్షణం నుంచి భక్తులకు కొలిచే కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చుతూ పల్నాడు ప్రాంత వాసుల పూజలు అందుకుంటున్నాడు.

ప్రత్యేక పూజలు..

ప్రతి సోమవారం బిలంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. శివరాత్రి, కార్తిక మాసం వంటి పుణ్యదినాల్లో భక్తులతో కోలాహలంగా ఉంటుంది. కృష్ణానదిలో స్నానమాచరించి బిలంలో కొలువై ఉన్న అమరలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం.

మహాశివరాత్రికి సర్వ సన్నద్ధం

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రికి మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం సర్వం సిద్ధమైనట్లు ట్రస్ట్ బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో బుర్రి నెమిలిరెడ్డి గురువారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించేందుకు వివిధ శాఖాధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారన్నారు. దక్షిణ భారతదేశంలోనే అతిపురాతన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన సత్రశాల దేవస్థానానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికేడ్లు, భక్తులకు తాగునీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతి, జల్లుస్నానం చేసేందుకు, వైద్య శిబిరాలు, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాట్లు చేశామన్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపి జన్‌కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు అధికారులు, మండలంలోని వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో భక్తులకు పూర్తి స్థాయిలో మౌళిక సదుపాయాలను కల్పించేందుకు నూరు శాతం కృషి చేయడం జరిగిందన్నారు. దేవస్థానం ఆవరణలో, వివిధ సమాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాలలో భక్తులకు ఎండ తీవ్రత లేకుండా ఉండేందుకు టెంట్లు వేసి భోజన ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.

మహాశివరాత్రి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

మాచర్ల: పట్టణంలోని వివిధ శివాలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే శివాలయాలలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. పాత మాచర్లలోని గంగాపార్వతి నగరేశ్వరస్వామి, జమ్మలమడక రోడ్డులోని రామప్ప దేవాలయం, వీరభద్రస్వామి దేవాలయం, బుగ్గమల్లేశ్వర దేవాలయం, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ వద్ద శివాలయం, సాగర్ రోడ్డులోని శివాలయం, భైరవునిపాడులోని శివాలయంతో పాటు అనేక ప్రాంతాలలో మహాశివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు.

నేడు ఏలేశ్వరస్వామి జాతర

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో గల సింహపురి కొండపై వెలసిన ఏలేశ్వరస్వామి జాతరకు వేళయింది. మహాశివరాత్రి సందర్భంగా శుక్ర, శనివారం రెండు రోజుల పాటు ఈ జాతర జరుగనుంది. శ్రీశైలం క్షేత్రానికి ఈశాన్య ద్వారంగా ఈ ఆలయం ఖ్యాతి పొందింది. ఈ ఆలయం ముందు నుంచి కృష్ణానది ఉత్తర దిశగా పయనిస్తుంది. ప్రసిద్ధ ఆలయం కావటంతో జలాశయం తీరానగల గ్రామ ల ప్రజలు భారీ సంఖ్యలో ఇక్కడికి వస్తారు. ఆలయానికి చేరుకోవాలంటే కేవలం లాంచీల ద్వారానే వెళ్లవలసి ఉంటుంది. శుక్రవారం రాత్రి ఇక్కడ శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది.

ఏలేశ్వరం కొండకు లాంచీ సర్వీసులు

మహాశివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం మాచర్ల మండలం అనుపు నుంచి ఏలేశ్వరస్వామి ఆలయానికి(మల్లయ్య గట్టు) ఏపీ టూరిజం ఆధ్వర్యంలో లాంచీ సర్వీసులు నడపనున్నారు. అనుపు నుంచి ఉదయం 6:30 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 వరకు ఏలేశ్వరస్వామి గట్టుకు లాంచీ సర్వీసులు నడపనున్నారు. పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150గా టికెట్ ధర నిర్ణయించారు. 5 సంవత్సరాలలోపు పిల్లలను ఉచితంగా అనుమతిస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి ...



శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాయి. కృష్ణానదిలో స్నానమాచరించిన మహిళలకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశాం. అదే విధంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాం. తాగునీటి వసతి, అన్నదానం వంటి చర్యలు చేపట్టాం. అదే విధంగా కృష్ణానదిలో స్నానమాచరించే వారు జాగ్రత్తలు వహించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాం.

– సురేష్ గణపతి, కార్యనిర్వహణాధికారి గురజాల